క్లుప్తంగా

ఓటు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ: కొత్త ఓటర్లు తమ ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం పోలింగ్ బూత్ లెవెల్ ఆఫీసర్లుకు తహసీల్దార్ శ్రీదేవి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్లందరూ ప్రస్తుతం ఉన్న ఓటరు లిస్టులో పేరు ఉందా? లేదా అని పరిశీలించుకోవాలని తెలిపారు. చనిపోయిన వారిని గుర్తించాలని, కొత్త ఓటర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు లిస్టుల్లో తప్పులు లేకుండా చూడాలని తెలిపారు.

కుమారస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకారంలో సుబ్రహ్మణ్యస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై ఉన్న శ్రీవల్లి, దేవసేన సమేత కుమారస్వామివారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. పలు రకాల అభిషేకాలు, పాలాభిషేకం, నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వారికి ఆలయాధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు రక్తపరీక్షలు చేసుకోవాలి



గర్భిణికి సూచనలు ఇస్తున్న వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: గర్భిణులు క్రమం తప్పకుండా రక్తపరీక్షలు చేసుకోవాలని, ప్రభుత్వాస్పత్రిలో అన్ని రకాల రక్తపరీక్షలు ఉచితంగా చేస్తున్నామని వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగలోని ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేసుకుంటే వ్యాధులను గుర్తించి, మందులు వాడవచ్చన్నారు. దీంతో కడుపులోని బిడ్డ క్షేమంగా ఉంటుందని తెలిపారు.

ముగిసిన గంగ జాతర



పొంగళ్లు తీసుకొస్తున్న మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచన పుత్తూరులో గంగ జాతర మంగళవారంతో ముగిసింది. జాతరలో భాగంగా గంగమ్మ విగ్రహానికి విశేషాలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయంలోని సుబ్రమణ్యంస్వామి, వినాయకస్వామి విగ్రహాలను, నవగ్రహాలను పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గంగమ్మ ఉత్సవ మూర్తిని గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు భారీసంఖ్యలో ఎదురు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ప్రత్యేక విద్యుత్ అదాలత్ రేపు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ధర్మరాజుల ఆలయం సమీపంలో ఉన్న డీఈఈ కార్యాలయం వద్ద గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. శ్రీకాళహస్తి సబ్‌డివిజన్ పరిధిలోని శ్రీకాళహస్తి, తొట్టంబేడు, బీఎన్‌కండ్రిగ, రూరల్ డివిజన్‌లోని శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, ఏర్పేడు మండలాలకు సంబంధించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగాదారులు పరిష్కారం కాని సమస్యలు ఏవైనా ఉంటే ఈ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు.

పేదల ప్రాణవాయువుగా సరళీకృత జీఎస్టీ

శ్రీకాళహస్తి: సరళీకృత జీఎస్టీ పేదల ప్రాణవాయువుగా మారిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ అన్నారు. శ్రీకాళహస్తిలోని బేరివారి మండపం వద్ద నుంచి నాలుగు మాడా వీధుల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వర్తకులు ర్యాలీ చేశారు. గాలిగోపురం దగ్గర ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్ బీడీ బాలాజీ, రాష్ట్ర సభ్యులు శ్రీమతి కండ్రిగ ఉమ, జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, అధికార ప్రతినిధి కొండేటి గోపాల్, మండల అధ్యక్షులు ఆర్. హరీష్ రెడ్డి, వేడం కృష్ణయ్య, భాగీర్థి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాతా పాహిమాం








బాలత్రిపురసుందరిగా ముత్యాలమ్మ, బ్రహ్మచారిణిగా బొమ్మలకొలువులోని అమ్మవారు, బాలత్రిపురసుందరిగా ఆలయంలోని కనకదుర్గమ్మ, గాయత్రీదేవిగా దక్షిణ కాళికాదేవి, భవానీమాతగా చాముండేశ్వరి అమ్మవారు



బ్రహ్మచారిణిగా ఏడుగంగల అమ్మవారు







రక్షాంబికాదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి, లలితాదేవి అలంకరణలో పొన్నాలమ్మ, గాయత్రిదేవిగా బీపీఅగ్రహారం చిన్నగంగమ్మ, వెండి కవచాలంకృత అలంకారంలో పెద్దగంగమ్మ, బాలత్రిపురసుందరిగా తెట్టు వద్ద నల్లగంగమ్మ



మహావిష్ణువుగా జ్ఞానప్రసూనాంబ

శ్రీకాళహస్తి: పాహిమాం.. మాత పాహిమాం అంటూ భక్తులు అమ్మవారి ఆలయాల్లో బారులు తీరారు. దసరా ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞానప్రసనాంబ అమ్మవారి ఉత్సవమూర్తి మహావిష్ణువుగా దర్శనమిచ్చారు. బొమ్మలకొలువులో ఏర్పాటు చేసిన అమ్మవారిని బ్రహ్మచారిణిగా, ఆలయంలోని కనకదుర్గమ్మ, కనకాచలంపై ఉన్న కనకదుర్గమ్మను విశేషంగా అలంకరించారు. ఆలయానికి అనుబంధంగా ఉన్న ఏడుగంగల అమ్మవారు బ్రహ్మచారిణిగా, ముత్యాలమ్మ అమ్మవారు బాలత్రిపురసుందరిదేవిగా అలంకరించారు. బజారువీధిలో ఉన్న కన్యాకాపరమేశ్వరి అమ్మవారి రక్షాంభికాదేవి అలంకారంలో, పానగల్‌లోని గంగమ్మ కామాక్షి అమ్మవారుగా, బీపీ అగ్రహారంలోని చిన్నగంగమ్మ గాయత్రిదేవిగా దర్శనమిచ్చారు. అలాగే పెద్ద గంగమ్మ వెండి కవచాలంకృత అలంకారంలో, భాస్కరపేటలోని చాముండేశ్వరి, భవానిదేవిగా, తెట్టు వద్ద ఉన్న నల్లగంగమ్మ బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

గాయత్రీదేవిగా సర్వమంగళాదేవి

సత్యవేడు: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వీరభద్ర స్వామి ఆయలంలోని సర్వమంగళాదేవిని గాయత్రీదేవిగా అలంకరించారు. మంగళవారం అమ్మవారిని అరటి పండ్లతో అలంకరించారు. ఉదయం అమ్మవారికి హోమం పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం భక్తులకు అన్నదానం చేపట్టారు.

బాలత్రిపుర సుందరిగా అవనాక్షమ్మ

నారాయణవనం: మండలంలోని సముదాయంలోని టీటీడీ అనుబంధ ఆలయమైన అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారు మంగళవారం బాలత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. సాయంత్రం అవనాక్షమ్మ అమ్మవారు బాలత్రిపుర సుందరిగా ఊయలలో ఊగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో టీటీడీ స్థానిక ఆలయాల సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజులు పాల్గొన్నారు. కైలాసనాథ కోనలోని కామాక్షాంభిక అమ్మవారు కంచి కామాక్షిగా దర్శనమిచ్చారు. తిరువట్యంలోని మూలస్థాన ఎల్లమ్మ లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.


మీనాక్షి అలంకరణలో మరగదాంబిక

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలోని పల్లికొండేశ్వర స్వామి దేవస్థానంలోని మరగదాంబిక మంగళవారం కామాక్షి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి చెన్నైకు చెందిన భారతి, వారి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి పి.లత, ఆలయ సిబ్బంది పరంధామ రెడ్డి, శరవణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గాయత్రీదేవిగా పార్వతీదేవి

ఏర్పేడు: మండలంలోని చిందేపల్లిలో వెలసిన శ్రీపార్వతీదేవి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో గాయత్రీదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త గంగలపూడి గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. కందాడలోని కామాక్షిదేవి సమేత సదాశివేశ్వరాలయంలో పసుపు అలంకరణలో అమ్మవారు ఆకట్టుకుంది. మునిరెడ్డి, వనజ ఉభయదారులుగా విశేష పూజలు చేశారు. మండలంలోని పాతవీరాపురంలో చెంగాలమ్మ పరమేశ్వరి ఆలయంలో గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.









సత్యవేడు: గాయత్రీదేవిగా సర్వమంగళాదేవి, నారాయణవనం: ఊంజల్‌సేవలో అవనాక్షమ్మ, నారాయణవనం: కైలాసనాథకోనలో.. కంచి కామాక్షిగా, లలితాదేవిగా మూలస్థాన ఎల్లమ్మ, నాగలాపురం: మీనాక్షి అలంకరణలో మరగదాంబిక, విశేష అలంకరణలో చిందేపల్లి పార్వతీదేవి, విశేష అలంకరణలో కందాడ కామాక్షిదేవి

జేసీబీ.. 4 ట్రాక్టర్ల సీజ్



సీజ్ చేసిన జేసీబీ, ట్రాక్టర్లు

రేణిగుంట: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఓ జేసీబీ, నాలుగు ట్రాక్టర్లను తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి సీజ్ చేశారు. మండలంలోని పిల్లపాళెం సమీపంలోని స్వర్ణముఖి నదిలో మంగళవారం ఇసుక అక్రమ తవ్వకాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడ అక్రమ తవ్వకాలు జరుపుతున్న జేసీబీ, ఇసుక తరలింపునకు సిద్ధంగా ఉంచిన నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసి, గాజులమండ్యం పోలీసులకు అప్పగించారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పల్లం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార స్టాల్ ప్రదర్శన

ఏర్పేడు: సమతుల పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నమ్మ అన్నారు. ఏర్పేడు మండలం పల్లం అంగన్‌వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం ప్రాముఖ్యత, మహిళలు, పిల్లల్లో రక్తహీనత లేకుండా ఉండాలంటే పోషకాహారం ఆహారం తీసుకోవాలని సూచించారు. పిల్లలలో ఊబకాయం తగ్గించాలంటే జంక్ ఫుడ్ తినకుండా చూడాలని చెప్పారు. ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ శిరీష పాల్గొన్నారు.

తిరుచ్చిపై సూర్యనారాయణుని విహారం

చంద్రగిరి : తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా వెలసిన శ్రీసూర్య నారాయణ స్వామివారు మంగళవారం తిరుచ్చి వాహనంపై విహరించారు. స్వామివారి జన్మనక్షత్రమైన హస్త సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని సేవించుకున్నారు. అనంతరం సూర్యనారాయణునుని తిరుచ్చిపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు.

13 గంటలు వద్దు.. 8 గంటలే ముద్దు



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేతలు

తొట్టంబేడు: కార్మికులు, ఉద్యోగుల చట్టబద్ధ హక్కు అయిన 8 గంటల పని దినాన్ని 13 గంటలుగా మార్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. 13 గంటల పని విధానాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని, అందులో భాగంగానే అసెంబ్లీలో 8 గంటల పనిదినాన్ని 13 గంటలుగా నిర్ణయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు దాసోహమయ్యాయనడానికి ఇదే ఉదాహరణ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, ప్రాంతీయ కార్యదర్శి గురునాథం, గంధం మణి, కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పరశురామేశ్వరునికి పుష్పయాగం



గుడిమల్లం పరశురామేశ్వరాలయంలో పుష్పయాగం



పుష్పాలను మేళతాళాలతో తీసుకెళుతున్న ఆలయ పెద్దలు

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లంలో ఉన్న ఆనందవల్లీ సమేత పరశురామేశ్వరునికి పుష్పయాగం వేడుకగా జరిగింది. శరన్నవరాత్రులలో భాగంగా మంగళవారం గుడిమల్లం ఆలయంలో ఈఓ రామచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు మేళ,తాళాలలో పుష్పాలను తీసుకొచ్చి స్వామివారికి పుష్పయాగం చేసి, ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గురజాడకు నివాళి

రేణిగుంట: స్థానిక జీఎం వీధిలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జన విజ్ఞాన వేదిక, మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యా వికాస వేదిక కన్వీనర్ ఓ. వెంకటరమణ, జన విజ్ఞాన వేదిక మండల కార్యదర్శి కుప్పస్వామి, ఐద్వా మండల అధ్యక్షురాలు భారతి, మండల కార్యదర్శి ఈశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వేలవేడులో వాటర్‌ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఇండస్ కాఫీ సంస్థ ప్రతినిధులు

శ్రీకాళహస్తి: మండలంలోని వేలవేడు గ్రామంలో ఇండస్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక సాయంతో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. సుమారు రూ.9 లక్షల వ్యయంతో దీనిని ఏర్పాటు చేశారు. ఎండీ హరీంద్రనాథ్, సీఎఫ్ఓ మహేష్ పెట్టూరు, హెచ్‌ఆర్ మేనేజర్ రమేష్, పెద్దలు చెలికం కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, మునెయ్య యాదవ్, చెంచుకృష్ణయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు

శ్రీసిటీలో ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన



మందులు పంపిణీ చేస్తున్న శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి

శ్రీసిటీ (వరదయ్యపాళెం): జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుని శ్రీసిటీ ఫౌండేషన్, తులసి ఆయుర్వేద ఆస్పత్రి సంయుక్తంగా మంగళవారం శ్రీసిటీలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 200 మందికి పైగా రోగులకు తులసి ఆయుర్వేదిక్ ఆస్పత్రి వైద్యులు శివప్రసాద్ పరీక్షలు చేశారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దీనిపై శ్రీసిటీ డైరెక్టర్ (సి ఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య భద్రతకు తాము ఎప్పుడూ పెద్దపీట వేస్తామన్నారు. శ్రీసిటీ మెడికల్ సెంటర్ ఆవరణలో శ్రీసిటీ ప్రతినిధులు నిరీషాసన్నారెడ్డి, రమేష్‌కుమార్, శివప్రసాద్ ఔషధ మొక్కలు నాటారు.

ఉచిత దంత పరీక్షలు

రేణిగుంట: విమానాశ్రయం సమీపంలోని పరిశ్రమలో పనిచేసే కార్మికుల సౌకర్యార్థం మంగళవారం రేణిగుంట సాయి దంత వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య నిపుణులు శివ సాయి ప్రసాద్ రెడ్డి, సాయి ప్రవీణ్, సమీరా, సారా గమ్య శ్రీ రోగులకు పరీక్షలు చేశారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

రేణిగుంట మండలంలో జరుగుతున్న వైద్య, ఆరోగ్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని మండల వైద్యాధికారి చక్రపాణి రెడ్డి తెలిపారు. మండలంలోని విప్పమానిపట్టడ, గుత్తివారిపల్లిలో వైద్య శిబిరాలు నిర్వహించారు. సర్పంచ్‌లు లక్ష్మీపతిరెడ్డి, మంజుల, వైద్యులు జుబేర్, డాక్టర్ తేజస్విని, సీహెచ్ఓ అన్నపూర్ణ, సూపర్‌వైజర్ కామరాజు, నాగరాజు పాల్గొన్నారు.

పేదల జీవన ప్రమాణాలు మెరుగుకే పీ4

సత్యవేడు: మండలంలో నిరుపేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు మండల అధికారులు పీ4 విధానం సమగ్రంగా అమలు పరచాలని జెడ్పీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మి కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వి. ప్రతిమ అధ్యక్షతన పీ4 విధానం అమలు, స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాల ప్రత్యేక డ్రైవ్‌పై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ మునిరవికుమార్, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద సౌత్ సెంట్రల్ రైల్వేస్ డిప్యూటీ జనరల్ మేనేజరు ఉదయ్‌నాథ్



ఆలయం వద్ద మాజీ న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని మంగళవారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. మధ్యప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ, సౌత్ సెంట్రల్ రైల్వేస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉదయ్‌నాథ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్న వారిలో ఉన్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు మోహన్, విద్యాసాగర్, సూపరిటెండెంట్ నాగభూషణం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్, ఏపీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోషణ మాసోత్సవాలు



పోషణ మాసోత్సవాల్లో పాల్గొన్న మహిళలు

శ్రీకాళహస్తి: మండలంలోని ఎర్రగుడిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ప్రగతి స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా పోషణ మాసోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలు, మహిళలు ఇంటి ఆవరణలో పెరటి తోటలను పెంచుకోవాలన్నారు. చౌకగా లభించే ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు, పెరటి తోటల్లో లభించే తోటకూర, బీర, చిక్కుడు, గోంగూర వంటివి తప్పక తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త లీలమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు.

సంచార నైవైద్యం

108 అంటే ప్రజల ప్రాణాలకు భరోసా. ఆపదలో ఉంటే క్షణాల్లో వచ్చి ప్రాణాలు కాపాడే సంజీవని. ప్రస్తుతం ఆ వాహనం రేణిగుంట మండలంలో కనిపించడం లేదు. ఫలితంగా పొరుగు మండలాల నుంచి రావాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రమాద బాధితుల ప్రాణాలకు రక్షణ, భద్రత కరువైంది. విధిలేని పరిస్థితిలో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. అవీ సమయానికి దొరక్క పలు సందర్భాల్లో బాధితులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది.

- రేణిగుంటలో 108 వాహనం నిలుపుదల
- సమయానికి క్షతగాత్రులను చేరుకోలేని వాహనం
- అటకెక్కిన అంబులెన్స్



అంబులెన్స్ రాకపోవడంతో క్షతగాత్రురాలిని ప్రైవేట్ వాహనంలో తరలిస్తున్న స్థానికులు (ఫైల్)

రేణిగుంట: మండలానికి 2023 సంవత్సరం నుంచి 108 వాహనం అందుబాటులోకి వచ్చింది. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో 108 వాహనం ఉంచి, ప్రమాదాల్లో గాయపడిన వారిని సరైన సమయానికి ఆస్పత్రులకు తరలించేవారు. మూడు నెలలుగా 108 వాహనం రేణిగుంటలో లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా తిరుపతి నుంచి 108 వాహనం రావాల్సివస్తోంది.

108 రాకకు ట్రాఫిక్ అంతరాయం

ప్రమాద అనంతరం బాధితులను కాపాడేందుకు అత్యవసర చికిత్స కోసం ఆస్పత్రికి తరలించేందుకు 108కు కాల్ చేయగా అంబులెన్స్ రావడానికి సుమారు 45 నిమిషాల సమయం పడుతోంది. బాధితులను ఆసుపత్రికి తరలించేందుకు మరో 45 నిమిషాల సమయం పడుతోంది. దీంతో బాధితులు ప్రాణాలు కోల్పోతున్నారు.

నిత్యం రద్దీగా రహదారులు

మండలంలో మూడు జాతీయ రహదారులున్నాయి. హైదరాబాద్, విజయవాడ, చెన్నై జాతీయ రహదారులు రేణిగుంట మండలం మీదుగా తిరుపతిలో కలుస్తాయి. ఈ రహదారుల్లో నిత్యం వేల మంది ప్రయాణిస్తుంటారు. అయితే మండలంలో 108 వాహనం లేకపోవడంతో ప్రమాదాలు జరిగిన సమయంలో సమయానికి చికిత్స అందక క్షతగాత్రులు మృత్యువాత పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

వీఐపీల తాకిడి అధికం

జాతీయ రహదారుల్లో అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నిత్యం ఎవరో ఒకరు వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖులు వస్తూ పోతూ ఉంటారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం అధికంగా ఉంటుంది. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని తరలించడానికి 108కు కాల్ చేసినా మంగళం, వడమాలపేట నుంచి 108 అంబులెన్స్ వచ్చేంత వరకు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండాల్సి వస్తోంది. రేణిగుంటలో 108 అంబులెన్స్ ఉంటే కొంత మంది ప్రాణాలైనా కాపాడే అవకాశం ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

రేణిగుంటకు 108 అత్యవసరం



ప్రధాన జాతీయ రహదారులున్న రేణిగుంటలో నిత్యం 108 వాహనం అందుబాటులో ఉండేటట్టు చూడాలి. అంబులెన్స్ ఆలస్యంతో ఒక్క ప్రాణం పోయినా తిరిగి తీసుకురాలేరు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన విషయం అయినందున ఉన్నతాధికారులు వెంటనే రేణిగుంటకు 108 వాహనాన్ని కేటాయించి, 24 గంటలు అందుబాటులో ఉండేటట్టు చూడాలి.

– సెల్వరాజ్ సీఐటీయూ మండల కార్యదర్శి, రేణిగుంట

ప్రజల ప్రాణాలతో చెలగాటం తగదు



రేణిగుంట మండలంలోని ప్రధాన రహదారుల్లో నిత్యం ఏదో ఒక రోడ్డు ప్రమాదం జరుగుతూనే ఉంది. అనేక మంది ప్రమాదాల్లో తీవ్ర గాయాలై అంబులెన్స్ కోసం నిరీక్షిస్తున్నారు. మూడు నెలల నుంచి 108 వాహనం రేణిగుంటలో లేకపోవడం దారుణం. ఆలస్యం చేయకుండా 108 వాహనం రేణిగుంటలో ఉండేటట్టు అధికారులు చర్యలు చేపట్టాలి.

– ఓ వెంకటరమణ, సీపీఎం సీనియర్ నాయకులు, రేణిగుంట.